క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొత్తగూడ: మండలంలోని కోనాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రమాదేవి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గుళ్లెపల్లి శ్రీనివాస్, స్థానిక మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ అందజేత



దోర్నకల్: గర్భిణులు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాధ్విజ కోరారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులతో నిర్వహించిన కార్యక్రమంలో 12మందికి న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు.

ఓటు హక్కుపై సాంస్కృతిక ప్రదర్శన



దోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లో బుధవారం ఓటు హక్కు ప్రాముఖ్యతపై నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. తెలంగాణ సాంస్కృతిక కళా బృందం ఆధ్వర్యంలో కళాకారులు ఓటు హక్కు విలువపై పాటలు పాడుతూ స్థానికులను చైతన్యపర్చారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు బండ వెంకన్న, కమిలి వెంకన్న, మిమిక్రీ సురేష్, పాషా, అశ్విని, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

కొత్తగూడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికారులందరు సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, ఇతర ఏర్పాట్లు, ఎన్నికల అధికారులకు సహాయ సహకారాలు అందించడంలో అన్నిశాఖల సమన్వయం అవసరం ఉంటుందన్నారు. ఓటర్లకు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా బీఎల్‌ఓలు పని చేయాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా కలసి పని చేయాలని కోరారు. సమావేశంలో ఏఓ ఉదయ్, ఎస్సై నగేష్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసేవకులకే పట్టం కట్టాలి

తొర్రూరు: ప్రజాసేవ చేసే వారికే పట్టం కట్టాలని భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతికంఠం లక్ష్మీ నరసింహరాజు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని స్వదేశీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ మద్దతుదారులు సందీప్, వంశీ, రాజు, నరేష్, ధనరాజు, శ్రీకాంత్, రోహిత్ పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు చేయించాలి



దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ఎస్సీ కాలనీలో చేతి పంపునకు మరమ్మతు చేయించి నీళ్లు అందించాలని కాలనీవాసులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చేతిపంపు 3నెలల నుంచి పనిచేయడం లేదన్నారు. సర్పంచ్, కార్యదర్శికి పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చేయించి నీటి సమస్య తీర్చాలని కాలనీవాసులకు కోరుతున్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

చెన్నారావుపేట : స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో బాలికలకు పోక్సో చట్టంపై లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు.

సాగునీరు ఇస్తేనే ఓట్లు వేస్తాం..



కాల్వ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న, గిరిజన రైతులు

మరిపెడ రూరల్: సాగునీరు అందిస్తేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేస్తామని మండలంలోని భూక్య తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మాటోతు తండా రైతులు తెలిపారు. ఈమేరకు బుధవారం నిరుపయోగంగా ఉన్న ఎస్సారెస్పీ కాల్వ వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బాధిత గిరిజన రైతులు మాట్లాడుతూ.. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి ఆయకట్టు నుంచి విస్సంపల్లి, ఉల్లెపల్లి, బీచ్‌రాజ్‌పల్లి, పురుషోత్తమాయగూడెం గ్రామాల చెరువుల కలుపుకుంటు సుమారు 50ఏళ్ల క్రితం అప్పటి మంత్రి చెన్నారెడ్డి పాలనలో గొలుసు కట్టు కాల్వను తవ్వారన్నారు. కానీ ఈ కాల్వ నుంచి ప్రస్తుత పాలకులు ఇంతవరకు చుక్కసాగు నీరు ఇచ్చిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. దీంతో చెరువులు, బావుల్లో నీరు లేక భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుకొని పోయి సాగునీరు కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఖరీఫ్ పంటలు నిలువున ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి కాల్వను పునరుద్ధరించి సాగునీరు అందించి పంటలు కాపాడాలని రైతులు వేడుకున్నారు. లేని క్రమంలో వచ్చే అసెంబ్లీ ఓట్లకు మాలోతు తండావాసులు దూరంగ ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు మాలోతు నెహ్రూ, మాలోతు జుమాని, హన్మ, వెంకన్న, జర్పుల మంగ్య, మాలోతు రామ, మాలోతు శోభన్‌బాబు, జర్పుల కల్యాణ్, జగన, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం వీడుకోలు నిర్వహించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వెంకట్రాంనర్సయ్య, గురునాధరావు, నరేష్ కుమార్, సంజీవను ఘనంగా సన్మానించి సత్కరించారు. గురునాధరావు పాఠశాల అభివృద్ధికి రూ.10వేలు విరాళంగా అందజేశాడు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేష్ బాబు మాట్లాడుతూ.. ఉపాధ్యాయల సేవలను కొనియాడి, గురునాధరావుకు కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు శ్రీధర్ రెడ్డి, ఉప్పలయ్య, సోహెన్, సతీష్ కుమార్, సోమేశ్వర్, తిరుపతి, శిబారాణి, మల్లారెడ్డి, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, కాసం శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

మండల సభ వాయిదా

గూడూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం సభ్యులు హాజరుకానందున వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ సుజాత తెలిపారు.

వీరన్న సన్నిధిలో పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఖమ్మం జిల్లా పాలేరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కందాల విజయరెడ్డి తోపాటు కుటుంబసభ్యులు పాలేరు ఎమ్మెల్యేగా కందాల ఉపేందర్‌రెడ్డి గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజాప్రతినిధులను కొనడం సమంజసం కాదు



సమావేశంలో మాట్లాడుతున్న హరిసింగ్‌నాయక్

గార్ల: ప్యాకేజీలు ఇచ్చి ప్రజాప్రతినిధులను కొనడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు తగదని, ఇల్లందు మార్కెట్ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్ అన్నారు. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య మండలంలోని ప్రజాప్రతినిధులకు ప్యాకేజీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఇల్లందు నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేష్, ఎంపీపీ శివాజీచౌహాన్, ఎంపీటీసీలు శీలంశెట్టి రమేష్, మంజుల, కోఆప్షన్ ఖదీర్, సర్పంచ్‌లు మోతీలాల్, సక్రు, జ్యోతి, భారతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



గంగారం: ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

గంగారం: మండలంలోని మడగూడెం గ్రామానికి చెందిన బూర్క సక్కుబాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య పరామర్శించాడు. అనంతరం కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి, జంగాలపల్లి సర్పంచ్ ఇస్లావత్ బాలకృష్ణ, నాయకులు ఈసం సమ్మయ్య, కోమట్ల గూడెం సర్పంచ్ గొగ్గల సుగుణ, లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గం సమ్మయ్య, ఉపసర్పంచ్ సతీష్, వెంకన్న పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని కోబల్‌తండా శివారు మూడుగుడిసెలలైన్‌తండాలో సోమవారం అనుమానాస్పద స్థితిలో కేలోతు బాలునాయక్ మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం బాధిత కుటుంబానికి కోబలతండా శివారు లైన్‌తండాకు చెందిన దుబ్బరాములునాయక్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోతు చందూలాల్‌నాయక్, కార్యదర్శి బానోతు హుస్సేన్‌నాయక్ రూ. 5వేల వేలు ఆర్థిక సహాయం అందించాడు. కార్యక్రమంలో కోబల్‌తండా సర్పంచ్ కమల శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయబాటలో పయనిద్దాం



మాట్లాడుతున్న దేవేందర్

కురవి: విద్యారంగ మార్పు కోసం పోరాడిన అమరుల ఆశయ బాటలో పయనిద్దామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్యా విధానం కోసం జార్జిరెడ్డి, జంపాల ప్రసాద్‌లతోపాటు అనేక మంది విద్యార్థి నాయకులు అమరులయ్యారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు మతం రంగు పులుముతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, మహేందర్ పాల్గొన్నారు.

ఓట్లేయండి.. గెలిపించండి

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ విస్తృత ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మున్నూరు కాపులు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందారని రాజ్యసభ సభ్యుడు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బుధవారం కేసముద్రం మండలంలోని అమీనాపురం గ్రామంలో గల ఎంకే కన్వెన్షన్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. మున్నూరు కాపులు కలిసికట్టుగా ఉండి, అన్నివిధాలుగా అభివృద్ధి సాధించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నాడు. అనంతరం పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసిన తనకు ఓటేయ్యాలని ఇల్లందు ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియ అన్నారు. బయ్యారం మండలంలోని గురిమెళ్ల, గౌరారం, ఉప్పలపాడు, నర్సాతండా, బాలాజీపేట, బాల్యాతండా పంచాయతీల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం వివిధ నుంచి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

బీజేపీ..

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒకటే అని మానుకోట బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ రూరల్ మండలంలోని మాధవాపురం గ్రామంలో హుస్సేన్ నాయక్ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీనాయక్ అన్నారు. బుధవారం కేసముద్రం మండలంలోని కేసముద్రంవిలేజ్, కోరుకొండపల్లి, తావుర్యాతండాజీపీ, మహముద్‌పట్నం, భుక్యారాం తండా జీపీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలని డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రామచంద్రునాయక్ అన్నారు. దంతాలపల్లి మండలంలోని రేపోని, కుమ్మరికుంట్ల, లక్ష్మీపూరం, దొనకొండ, దాట్ల, గున్నెపల్లి, రామానుజపురం గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు.

నామినేషన్ల దాఖలు



దోర్నకల్: తెలంగాణ జాగిరు పార్టీ నుంచి నామినేషన్ వేస్తున్న వాంకుడోతు రవికుమార్



దోర్నకల్ స్వతంత్ర అభ్యర్థి గోపి కృష్ణ



దోర్నకల్: స్వతంత్ర అభ్యర్థి అజ్మీర రత్న

జిల్లాలోని పలు పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో నాలుగు, డోర్నకల్ నియోజకవర్గంలో ఐదు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. - సాక్షి, నెట్‌వర్క్



మహబూబాబాద్: నామినేషన్ వేస్తున్న ఎన్డీ అభ్యర్థి బట్టు బిన్నమ్మ

కార్మికులకు కనీస వేతనం అమలుచేయాలి



మాట్లాడుతున్న రామయ్య

నెహ్రూసెంటర్: కార్మికులకు కనీస వేతనం మేనిఫెస్టోలో పొందుపర్చి అమలయ్యేలా ప్రకటించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా జి.రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులు కనీస వేతనానికి నోచుకోవడం లేదని, కనీసం ఉపాధి, భద్రత చట్టం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎజెండాలో కార్మికుల సంక్షేమం కోసం హామీలు ఎందుకు ఇవ్వడం లేదని విమర్శించారు. ఇప్పటికైన పార్టీలు ఆలోచించి కార్మికులకు న్యాయం చేకూర్చే విధంగా తమ మేనిఫెస్టో రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యం, సహాయ కార్యదర్శి కె.భాస్కర్ రెడ్డి, యాకయ్య, పాదియా , పుల్లయ్య, లచ్చయ్య, వెంకన్న, ఏర్పుల మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



గార్ల: పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు



గూడూరు: మురళీనాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ సర్పంచ్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు, 32వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి సమక్షంలో ప్రముఖులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో సింగం మనోహర్, సింగిల్ విండో డైరెక్టర్ మొగిలి ప్రసాద్, కటికరెడ్డి శ్రీనివాస్, కొల్లూరి రవికుమార్, నూకల హరికృష్ణారెడ్డి, మాజీ వార్డు సభ్యుడు వంగ వెంకటరమణ ఉన్నారు. అదే విధంగా మండలంలోని సాదుతండా, చోక్లతండా జీపీల పరిధిలోని, దామ్యతండా జీపీ పరిధిలోని జేత్యాతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు లాలావత్ రమేష్, భూక్య సుందర్, బానోత్ గణేష్, బానోత్ మంగిలాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ భూక్య ఉమా సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

గార్ల: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమక్షంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు జాటోత్ ఝాన్సీలక్ష్మి, సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, వట్టం జానకి రాణి, గంగావత్ రుక్మిణి, లావణ్య, ప్రవళిక, గంగావత్ కుంతి, ఎంపీటీసీలు మన్నెపల్లి సుగుణాదేవి, భట్టు నాగరాజు, సొసైటీ డైరెక్టర్లు శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, నాదేండ్ల రామారావు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కమలమ్మ, డేవిడ్, వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

గూడూరు: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ రుణం అధికారం కట్టబెట్టి తీర్చుకుందామని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండలంలోని తేజావత్ రాంసింగ్‌తండా సర్పంచ్ బానోతు మంగీలాల్, వార్డు సభ్యులు, గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి మురళీనాయక్ సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. నాయకులు వెంకన్న, ప్రదీప్‌రెడ్డి, మధుగౌడ్, వీరస్వామి, వాంకుడోతు కోమ్మాలు, హెచ్ శివ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహారాష్ట్ర నుంచి దోర్నకల్‌కు కూలీలు..



దోర్నకల్: మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి డోర్నకల్ రైల్వే జంక్షన్‌కు కూలీల రాక ప్రారంభమైంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్, నాందేడ్ తదితర ప్రాంతాల నుంచి రైళ్ల ద్వారా వేల సంఖ్యలో కూలీలు డోర్నకల్ చేరుకుని ఇక్కడి నుంచి ఖమ్మం, కృష్ణా, నల్లగొండ, సూర్యాపేట తదితర జిల్లాలోని గ్రామాల్లో మిరపతోటల్లో కాయకోత పనులకు వెళ్తుంటారు. ప్రస్తుతం పత్తి తీసే పనులు కొనసాగుతుండడంతో మహారాష్ట్ర నుంచి కూలీల రాక ప్రారంభమైంది. పత్తి తీసే పనులు పూర్తవగానే మిరప తోటలలో కాయ కోత పనులు ప్రారంభం అవుతుండటంతో సుమారు ఆరు నెలల వరకు కూలీలు గ్రామాలు, వ్యవసాయ భూముల్లో నివాసం ఉంటూ పనులు చేస్తుంటారు.

చెక్కు అందజేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన మోరం శ్రీను అనారోగ్యంతో మృతిచెందగా నామిని అయిన భార్య సరోజకు డెత్ క్లెయిమ్ చెక్కును ఎల్‌ఐసీ ఎస్బీఎం వెంకటేశ్వర్లు, డెత్ క్లెయిమ్ ఏఏఓ పీ.హనుమంతబాబు, హెచ్‌జీఏలు శంకర్, ఆనంద్ తదితరులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్ గంట వెంకటరమణారెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మరిపెడకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

దోర్నకల్/కురవి: మరిపెడలో బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి



తొర్రూరు: విద్యార్థుల ఉన్నతికి అధ్యాపకులు కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెబ్బ శ్రీనివాసరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన బరిగెల నారాయణను బుధవారం డివిజన్ కేంద్రంలోని కళాశాలలో అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, కుమారస్వామి, సువర్ణ, అన్నపూర్ణ, ఉప్పలయ్య, నర్సయ్య, మల్లయ్య, అనిత, చారి, శివ, రామకృష్ణ, రాజేష్, అలీ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

బయ్యారం: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను బయ్యారంలో పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వీట్లు పంచారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తొర్రూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి కెనాల్‌లో పడి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారిమడూరు శివారు గుడిబండ తండా సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో శవం కొట్టుకుని వచ్చి తుమ్మ చెట్లకు తగిలి నిలిచింది. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు చేరుకుని శవాన్ని బయటకు తీశారు. మరణించిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల ఉంటుందని, శవాన్ని గుర్తిస్తే 87126 56982, 87126 56984 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. మృతదేహాన్ని మహబూబాబాద్ మార్చురీలో భద్రపరిచారు.

నియంతలను ఓడించాలి

కేసముద్రం: ప్రజాస్వామ్యంలో నియంతలకు చోటుండదని, అలాంటి వారిని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ఓటు వజ్రాయుధం లాంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గొడిశాల వెంకన్న, బొబ్బాల యాకుబ్‌రెడ్డి, చాగంటి కిషన్, నర్సయ్య, ఉప్పలయ్య, సూరారెడ్డి, ఆవుల వెంకన్న, సత్తిరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు



కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ రూరల్: మండలంలోని నడివాడ గ్రామంలోని బీఆర్‌ఎస్ పార్టీ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు మహబూబాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి హుస్సేన్ నాయక్ సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు.